వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర-మందస : మండలం దున్నూరు పంచాయితీ కొత్తపితాలి గ్రామంలో బుధవారం వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, పోలీసులు ఇచ్చిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపితాలి గ్రామంలో పుట్టింటిలో ఉన్న తాళ్ల స్నేహ(21) ఇంటిలో ఎవరు లేని సమయం లో ఉయ్యాల కొక్కెనికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతిరాలు స్నేహకు 8 నెలల క్రితం మండలం బేతాళపురం గ్రామానికి చెందిన బి.విజయ్‌తో వివాహమైంది. విజయ్ ప్రస్తుతం తమిళనాడులో నేవిలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. మృతిరాలి తల్లి తాళ్ల భాగ్యలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదుమేరకు మందస ఎస్.ఐ వై.రవికుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కాకినాడ ఆదిత్య కళాశాలల ప్రభంజనం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : స్థానిక 80 అడుగుల రోడ్ దగ్గర ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల 2022-23 విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 124 ఎమ్ఎన్ సి కంపెనీలలో ప్రాంగణ ఎంపికలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బి ఎస్ చక్రవర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కె శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రముఖ ఎమ్ఎన్ సి కంపెనీలలో ఇప్పటివరకు మంచి వార్షిక వేతనంతో 5000 ప్రాంగణ ఎంపికలు వచ్చాయని ఇది డిగ్రీ కళాశాలలో ఒక సువర్ణ అధ్యాయం అని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతీ తల్లిదండ్రులు తమ పిల్లలను ఓక మంచి ఉన్నత ఉద్యోగంలో చూడాలని ఒక కల గా ఉందని అటువంటి కలల ను ఆదిత్య విద్యా సంస్థలు సాకారం చేస్తున్నాయన్నారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించడానికి కారణం కళాశాలలో క్రమశిక్షణ తో కూడిన విద్యను అందివ్వడమే అని, విద్యార్థి కళాశాలలో చేరిన మొదటి రోజునుండి క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇవ్వడమే అని అన్నారు.కంప్యూటర్ కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ పై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ప్రాంగణ ఎంపికలలోనే కాకుండా సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలుస్తున్నాం అన్నారు. కళాశాలలో ఇచ్చే శిక్షణ ఇతర పోటీ పరీక్షలకు కూడా ఉపయోగపడుతుంది అన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులకు, విజయానికి కారణం అయినా అధ్యాపకులకు చైర్మన్ డా. ఎన్ శాషారెడ్డి, సెక్రటరీ డా.ఎన్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా. బిఈవి ఎల్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకట అప్పారావు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తాం

- టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి
- సీపీఐ బృందం పర్యటనకు స్పందన
- పోలీసుల మొహరింపు

విశాలాంధ్ర-పలాస/మెళియాపుట్టి : రాష్ట్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన నీటి ప్రాజెక్టుల పరిస్థితులు తెలుసుకునేందుకు రాష్ట్ర సీపీఐ కార్యదర్శి కె.రామక్రిష్ణ ఆధ్వర్యంలో బృందం మంగళవారం ఆఫ్‌షోర్ రిజర్వాయరు ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలనపట్ల అధికారులు స్పందించారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో భారీగా పోలీసులను మొహరించారు. బుధవారం పలాస మండలం రేగులపాడు, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామాల్లో టెక్కలి సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి అధికారుల బృందం పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలను సందర్శించిన సబ్ కలెక్టర్ నిర్వాసితుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ భూ సేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయినవారికి ఇళ్ల స్థలాలు గాని, యూత్ ప్యాకేజీలు గాని ఇంతవరకు అమలుచేయలేదన్నారు. నిర్వాసితుల కాలనీలో నిర్మించుకున్న ఇళ్లకు మౌళిక వసతులు, రహదా రులు, కాలువ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, కల్పించలేదని వాపోయారు. విద్యుత్ స్తంభాలు వేసినా వాటిని బల్బులు అమర్చలేదని, చీకట్లలోనే జీవిస్తున్నామని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పిల్లలకు స్కూల్, ఆటలాడుకునేందుకు ఆట స్థలం ఏర్పాటు చేయాలని కోరారు. రిజర్వాయరు ప్రాంతంలో అనేకమంది ఇళ్లు, ఆస్తులు కోల్పోయారని, అలాంటి వారిని వెంటనే ఆదుకుని ఆర్.ఆర్ చట్టం ప్రకారం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించిన తరువాతే రిజర్వాయరు పనులు చేపట్టాలని కోరారు. నిర్వాసితుల సమస్యలను సిపిఐ నాయకులు చాపర సుందరలాల్, చాపర వెంకటరమణ, చీపురుపల్లి గ్రామ సర్పంచ్ ఈశ్వరరావులు అధికారుల దృష్టికి తీసుకొచ్చి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈయన వెంట మెళియాపుట్టి తహశీల్దార్ పి.సరోజిని, ఆర్ఐలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సతీష్ కుమార్‌తోపాటు రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

వైయస్ జగన్ పాలనలోనే సామాజిక న్యాయం : ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : దేశంలోనే ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పరిపాలనలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఎమ్మెల్సీగా నర్తు రామారావు నామినేషన్ వేస్తున్న సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాసన మండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సంబంధించి జగన్ కల్పిస్తున్న ప్రాధాన్యత ఆయా వర్గాల అభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధిని, దూరదృష్టిని తెలియచేస్తోందనీ వివరించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావుకు ఎమ్మెల్సీ పదవిని అంతకు ముందు చేసిన వాగ్దానం ప్రకారం ఇవ్వడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జిల్లాలో యాదవ సామాజిక వర్గం నాలుగవ పెద్ద సామాజిక వర్గమని వారి ప్రతినిధిగా జిల్లా నుంచి చట్టసభల్లో ప్రాధాన్యత దక్కడం పెద్ద గౌరవమని పేర్కొన్నారు. తదుపరి అవకాశం కళింగ వైశ్యులకు దక్కుతుందని, అలాగే అన్ని కులాలకు సరైన సమయంలో సరైన అవకాశం లభిస్తుందని కృష్ణదాస్ చెప్పారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కలింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, చిరంజీవి నాగ్, ఎంపీపీ వాన గోపి, చింతు రామారావు, అంబటి శ్రీనివాసరావు, పాల వసంత రెడ్డి, రాజాపు అప్పన్న తదితరులు ఉన్నారు.

రజకులపై సీఎం జగన్‌కు చిన్నచూపు

ఎమ్మెల్సీ ఇవ్వకుండా వైకాపా దగా చేసింది : రజకుల సంఘం

విశాలాంధ్ర-రణస్థలం : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్న రజకులుపై చిన్నచూపు చూస్తున్నారని శ్రీకాకుళం జిల్లా రజక సఘం జిల్లా నాయకులు గురజాపు రాము, నౌపాడ రామారావు, సోపేటి రామారావు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఇటీవల వైకాపా ప్రభుత్వం పలు కులాలకు ఎమ్మెల్సీ పధవులను కట్టబెట్టింది. రజకులకు చట్ట సభల్లో ప్రాద్యాన్యత కల్పిస్తామన్న వైకాపా రజకులను అన్ని రంగాల్లో అణగదొక్కేస్తుందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ టిక్కెట్ల కేటాయింపులో కూడా తీవ్ర అన్యాయం చేసిందని వారు ఆవేధన వ్యక్తం చేశారు. రజకులు ఆత్మ గౌరవం కాపాడుకునేందుకు రాబోయే ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వానికి ఓటు ద్వారా తగిన బుద్ది చెబుతామని వారు హెచ్చరించారు. రాష్ట్రంలో రజకులు జనాభా ప్రాతిపాదికిన 7వ స్థానంలో ఉన్నారని గుర్తుచేశారు. అన్ని కులాలకు సమ నాయకత్వం కల్పిస్తామన్న సిఎమ్ జగన్‌కు రజకులు కనిపించలేదని అన్నారు. రజకులకు ఎమ్మెల్సీ ఇవ్వకుండ జగన్ దగాచేశారని మండిపడ్డారు. జగన్ పాదయాత్రలో రజకులకు ఎస్‌సి రిజర్వేషన్ కలిస్తామన్నారు... 17 రాష్ట్రాల్లో... 4 కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్‌సి రిజర్వేషన్ పొందుతున్నారని గుర్తుచేశారు. రజకులకు ఎస్‌సి రిజర్వేషన్ కల్పించిటకు కొరకు గత ప్రభుత్వంలో రజకులు స్థితుగతులు తెలుసుకోవటానికి త్రిసభ్య కమిటి ఏర్పాటుచేసి ఆ కమిటి సభ్యులు పలు జిల్లాల్లో పర్యటించారన్నారు. ఒకే దేశం ఒకే జిఎస్‌టీ అమలుచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే దేశంలో ఒకే సామాజిక వర్గం (రజక) కులానికి ఒకటే ఎస్‌సి రిజర్వేషన్ కల్పించాలని వారు కోరారు. ప్రభుత్వం రజకులకు అందించి జగనన్న చేదోడు పథకం షాపులు పేరుతో అర్హులైన లబ్దిదారులకు పథకం అందలేదని,...గ్రామాల్లో రజక వృత్తు చేస్తున్న వృత్తుదారులందరి చేదోడు పథకం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రజక సంఘం నాయకులు జొన్నాడ భాస్కరరావు, ధర్మవరపు శంకరరావు, మోసంగి రామారావు, దమరసింగి మహాలక్ష్మి, కోస్టు రమణ, కొర్లాపు లక్ష్మణరావు, పాపారావు, రాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కేశవరావును దువ్వాడ పరామర్శ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ సర్పంచ్ గురువెల్లి కేశవరావు తల్లి నరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ దువ్వాడ శ్రీనివాస్ ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళు లర్పించారు. అనంతరం కేశవరావును, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. నరసమ్మ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు పీఏసీఎస్ అధ్యక్షుడు బాదాన మురళి, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజ్, దుంగ శిమ్మన్న, అల్లు కళ్యాణి, ఎంపీటీసీ పూజారి సత్యం అదితరులు పాల్గొన్నారు.

షాట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

విశాలాంధ్ర-మెళియాపుట్టి : కరెంట్ సర్క్యూట్ జరగడంతో పూరిల్లు దగ్ధమైన సంఘటన మెలియాపుట్టి మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే మండలంలో గల దీనబంధుపురం గ్రామంలో సుమారు ఉదయం పదకొండు గంటల సమయంలో బుధవారం నాడు విద్యుత్ షాట్ సర్క్యూట్ జరగడంతో హరిపురం సరస్వతికి చెందిన రేకిళ్ళుతో పాటుగా పడాల సోమయ్య, జన్ని సుందరమ్మ, జన్ని సోమేష్ లకు చెందిన పశువుల సాలకు షాట్ సర్క్యూట్ జరగడంతో ఆకాస్మాత్తుగా మంటలు చెలరేగాయని దీంతో స్థానికులంతా మంటలను అదుపుచేసినట్టు తెలియజేశారు. అయినప్పటికీ బట్టలు, కొంత మొత్తం నగదు, నిత్యవసర సరుకులతో 50 వేలు విలువ చేసే దుక్కి మిషన్ అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు వాపోయారు. అయితే ఆ సమయంలో ఇంటిలో సుమారు పదేళ్ళ బాలుడు నిద్రపోతుండ డంతో మంటలు రావడంతో స్థానికులు కేకలు వేయడంతో బయటకు వచ్చాడని దీంతో ప్రాణనష్టం జరగకుండా పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులంతా ఊపిరిపీల్చు కున్నారు. అనంతరం విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ సవర కావేరి వెంకటేష్, సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు నిత్యవసర సరుకులను అందించారు. జనసేన మండల నాయకులు బాలరాజు, కిరణ్ లు పరామర్శించి, ప్రమాదం ఎలా సంభవించింది తదితర వివరాలను అడిగి తెలుసుకుని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు.

తహశీల్దార్ కార్యాలయ నైట్ వాచ్‌మెన్స్‌కు జీతాలు వెంటనే అందించాలి

- ప్రభుత్వం విడుదల చేసిన రూ.19.18 లక్షలు ఏ.ఓ. నిర్లక్ష్యం
- 23 నెలలు బకాయి జీతాలు వెంటనే అందించాలి
- పస్తులతో జీవిస్తున్న నైట్ వాచ్ మెన్స్ కుటుంబాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్/నరసన్నపేట: తహశీల్దారు కార్యాలయాల్లో పని చేస్తున్న నైట్ వాచ్ మెన్స్‌కు బకాయి పడిన ఇరవై మూడు నెలల జీతాలు వెంటనే ప్రభుత్వం అందించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, జిల్లా రెవెన్యూ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిలి రామారావులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలక్టరు కార్యాలయం ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ బత్తిలి రామారావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, చిక్కాల గోవిందరావులు మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయాల్లో పనిచేసిన నైట్ వాచ్‌మెన్స్‌కు బకాయిపడిన 23 నెలలు జీతాలు వెంటనే ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం డిసెంబరు 30, 2022న విడుదల చేసిన 19.18 లక్షలు రూపాయిలను జీతాలు చెల్లించుటలో ఏ.ఓ. బి.రాజేశ్వరరావు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. యాభై రోజులు గడిచినా స్పందించలేదని ఆరోపించారు. జీతాలు అందక పస్తులతో నైట్ వాచ్‌మెన్ కుటుంబాలు దుర్భరంగా మారాయన్నారు. అంతకుముందు కలక్టరు కార్యాలయం గేటు వద్ద ధర్నా చేసి,సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని నినదించారు. అనంతరం జాయింట్ కలక్టరుకు, డి.ఆర్వోకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డేవిడ్, పాలక హరీష్, జి.మోహనరావు, సింగ్, బగ్గు నాగేశ్వరరావు, ఏఐటియుసి నాయకులు బి.రామారావు, పి.అప్పారావు, ఎం.రాము, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-సోంపేట : బుధవారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో సోంపేట మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి జెపి రోహిత్ మొదటి స్థానం దక్కించుకున్నాడు. ఈ నెల 27, 28 తేదీల్లో జరగబోయే రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థినిని, ప్రోత్సహించిన సైన్స్ టీచర్లు వి.వి.ఆర్ హరిత, తిరుమళ్ల దీప్తి, జయశ్రీ, కొయ్య శ్యామశ్రీ, బెందాళం మానమ్మలను ప్రిన్సిపాల్, సిబ్బంది, తల్లిదండ్రులు కమిటీ సభ్యులు అభినందించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవికి మొదటి ప్రాధాన్యత ఓటు కల్పించాలి

ఎమ్మెల్యే బెందాళం అశోక్

విశాలాంధ్ర-కవిటి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిని మొదటి ప్రాధాన్యత ఓటు కల్పించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఈమేరకు బుధవారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో ప్రచారంలో పాల్గొని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నమస్యలపట్ల అవగాహన కలిగిన, ఉద్యోగ ఉపాధ్యాయుల, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాట సమర్థుడు ఎందరో పట్టభద్రుల విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్పించిన డాక్టర్ వేపాడ చిరంజీవికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు,చిట్టి మోహన్, సిపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు,బాసు ప్రధాన్, బిఎస్సార్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ జల్లు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి

విశాలాంధ్ర-హిరమండలం : జిల్లాలో నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైం) వి.విఠలేశ్వరరావు అన్నారు. బుధవారం హిరమండలం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి మండలంలోని నేరాలు వివరాలను సిఐ ఆర్ వేణుగోపాలరావు ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం క్రైం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాలను నియంత్రించడంలో పోలీసు అధికారులు, సిబ్బంది నిర్విరామంగా పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలో క్రైం రేటు తగ్గేలా చూస్తున్నామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నామని వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను రవాణాచేసే వాహనాలపై కఠినంగా వ్యవహరిం చాలన్నారు. మహిళల భద్రతకు అన్నిరకాల చర్యలు చేపట్టాలని, వారి భద్రత సహ కారం అందించాలన్నారు. ఎస్సై జి.నారాయణస్వామి, కొత్తూరు సిఐ వేణు గోపాల్‌రావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వేతనదారులందరికీ ఉపాధిని కల్పించండి : డ్వామా పిడి

విశాలాంధ్ర-గార : ప్రతి పంచాయతీలోనూ పనికోరిన వేతనదారులందరికీ ఉపాధిని చూపించాల్సిందేనని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవి చిట్టి రాజు సిబ్బందికి స్పష్టం చేశారు. బుధవారం వత్సవలస పంచాయతీ ఆమదాలపాడు గ్రామంలో జరుగుతున్న అమృత్ సరోవర్ చెరువు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలో కనీసం 200 మంది జాబ్ కార్డ్ దారులకు పనులు కల్పించాలన్నారు. మాస్టర్లు ఎన్ ఎం ఎం ఎస్ యాప్ ద్వారా అప్లోడ్ చేయడం ద్వారా సకాలంలో వేతనాలు చెల్లింపునకు అవకాశం ఉంటుందన్నారు. కూలీలకు వంద రోజుల పని దినాల కల్పన పైనే ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సాగటు వేతనం రూ.250 తక్కువ కాకుండా పనులు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి కల్పనకు అవసరమైన పనులను గుర్తించి ఎస్టిమేషన్లు తక్షణం పంపించాలని, పనుల కొరతను సాకుగా చూపించి ఉపాధిని చూపించనట్లయితే చర్యలు తప్పవన్నారు. కూలీలు సమయపాలన పాటించి రెండు పూటలా పనులు చేపట్టాలని, చేసిన ప్రతి పని తమ సొంత పనిగా భావించాలని కోరారు. పిడి వెంట సూపర్ ఇండెంట్ ఎం రవి కుమార్, ఏపీఓ సంధ్యారాణి, జేఈ నారం నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ దర్యాప్తు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం దంత గ్రామానికి చెందిన బొమ్మాళి రవి మంగళవారం ఇచ్చిన పిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన సూరపు గోవిందరావుపై నమోదైన ఎట్రాసిటి కేసుపై కాశీబుగ్గ డీఎస్పీ శివరామిరెడ్డి బుధవారం గ్రామంలో ధర్యాప్తు నిర్వహించారు. ఈసందర్భంగా రవికి, గోవింద రావుల మధ్య జరిగిన సంఘటనపై గ్రామస్థులకు అడిగి తెలుసుకున్నారు. అలాగే రవిపై జరిగిన దాడి స్థలాన్ని పరిశీలించారు. ఈయనతో పాటు టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, స్థానిక ఎస్ఐ ఎస్‌కె. మహ్మద్‌ఆలీ, సిబ్బంది ఉన్నారు.

కారులో మంటలు.... దగ్ధం

సురక్షితంగా బయటపడ్డ ప్రయాణీకులు

విశాలాంధ్ర-పొందూరు : మండలం తాడివలస సమీపంలో బుధవారం ఉదయం ప్రయాణిస్తున్న మారుతి హ్యుండాయ్ కారులో మంటలు చెలరేగి దగ్ధమైంది. గ్రామానికి చెందిన బంధువైన అంపోలు భాస్కర్ విశాఖపట్నంలో విధులు నిర్వర్తిన్నారు. భార్యతోపాటు భాస్కర్ గ్రామంలో నీ అత్తవారింటికి వస్తున్నాడు. గ్రామానికి సమీపంలో ఉన్న రెల్లిగెడ్డ బ్రిడ్జి దాటిన వెంటనే రోడ్డుపై ఎండపెట్టిన మినపచేను మీదకు రాగానే కారు క్రిందభాగం నుంచి మంటలు చెలరేగాయి. బయటవ్యక్తులు అప్రమత్తం చేయడంతో బాస్కర్ భార్యతో పాటు క్రిందకు దిగడంతో పెద్ద ప్రమాద%శీ% తప్పింది.

పదిలో ఉత్తమ గ్రేడ్లు సాధించాలి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు, రానున్న పరీక్షలలో, ఉత్తమ గ్రేడ్లు సాధించాలని ప్రధానోపాధ్యాయులు వి.జానకిరామయ్య అన్నారు. దండుగోపాలపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంహత్సరంలో మూడవ సమావేశము నిర్వహించామని అన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షలలో విద్యార్థులు సాధించిన మార్కులను, చదివి వినిపించారు. ఇప్పటి కి, నెలరోజుల వ్యవధి మాత్రమే ఉందని, ఈ తరుణంలో తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టవలసిన అవసరము ఉందని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు ఏడుగురు చొప్పున పిల్లలను దత్తత తీసుకొని వారి చదువు తీరును ఫోన్ చేయటంద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకొని వారికి తగు సూచనలు చేస్తున్నారని, అదేవిధంగా ఇకనుండి ప్రతిరోజూ రాత్రి సమయాలలో మీ మీ ఇండ్లను సందర్శనకు వస్తామని తెలిపారు. తల్లిదండ్రులు టివి కనెక్షన్ తొలగించాలని, స్మార్ట్ ఫోన్ పిల్లలకు ఇవ్వద్దని, వారికి ఎటువంటి పనులు చెప్పవద్దని, మంచి ఆహారము ఇవ్వాలని, ప్రతి విద్యార్థి రాత్రి 10-00 గంటల వరకు చదివేటట్లు మరియు ఉదయము 4-00 గంటలకు నిద్రలేచి చదివేటట్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి. భాస్కరరావు, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మీకాంతం, భవాని, లక్ష్మి, సూర్యకాంతం, సునీత, పార్వతి, అరుణశ్రీ, ఉమ, చిన్నారావు, రాము, అప్పలరాజు, మార్కండేయులు, సిఆర్‌పి గిరి, రోజా, కృష్ణవేణి, దయాసాగర్, శివ, పాల్గొన్నారు.

బొడ్డేపల్లి ఆశయాలు కొనసాగించాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : శ్రీకాకుళం మాజీ ఎం.పి, స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాల్ ఆశయాలు ప్రతి ఒక్కరు కొనసాగించాలని పలాస కాశీబుగ్గ మున్సిపల్ కౌన్సిలర్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతినిధి దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. బుధవారం పలాస గణపతి లాడ్జి కళ్యాణ మండపంలో బొడ్డేపల్లి రాజగోపాల్ వర్ధంతి వేడుకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాళింగ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ధరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఇంటర్మీడియట్ విధ్యను పూర్తిచేయాలనుకునే వారికి అవకాశం కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విధ్యాపీఠం ధరఖాస్తులు ఆహ్వానించినట్లు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి. రజనీకుమారి తెలిపారు. ఏ.పి ఇంటర్మీడియట్ బోర్డు చొరవతో ప్రతీ జూనియర్ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేసి ఔత్సాహికులు ఇంటర్ పూర్తి చేసేలా వెసులుబాటు కల్పించడం జరిగిందని, ఈ మేరకు ఈ నెల 27వ తేదీ లోగా ధరఖాస్తులు కళాశాల పనివేళల్లో సమర్పించాలని ఆమె కోరారు.

విశేష సేవలందించిన ప్రజానాయకుడు 'బొడ్డేపల్లి'

తాత ఆశయాలు కొనసాగిస్తా : మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్

విశాలాంధ్ర-ఆమదాలవలస: సేవా తత్పరుడు, పేదల పాలిట పెన్నిధి, నిరంతర కృషీవలుడు, జిల్లా అభివృద్ధికి విశేష సేవలు అందించిన ప్రజా నాయకుడు స్వర్గీయ బొడ్డేపల్లి రాజ గోపాలరావు ఆశయ సాధనకు తన వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న వ్యక్తిగా ఆశయాలను కొనసాగిస్తానని మాజీ మున్సిపల్ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్ అన్నారు. 31వ వర్ధంతి సందర్భంగా బుధవారం బొడ్డేపల్లి స్వగ్రామం అక్కులపేట వద్ద ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రగతికి రాజగోపాల్ రావు కృషి అజరామరం అన్నారు. ఆరుసార్లు పార్లమెంటు సభ్యునిగా ఎన్నికై వ్యవసాయ రంగ, పారిశ్రామిక రంగ అభివృద్ధికి కృషి తెలిపారని వివరించారు. వంశ ధార ప్రాజెక్టుకు అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి సంజీ వయ్యను తెచ్చి శంకుస్థాపన చేసిన ఘనత బొడ్డేపల్లి కుటుంబానికి దక్కుతుంది. సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంతో జిల్లాలో రైతు బాంధవునిగా నిలిచారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా ఏర్పాటుచేసి కేంద్ర ప్రభుత్వం వద్ద నుంచి శ్రీకాకుళాన్ని వెనుకబడిన జిల్లాగా గుర్తించి నిధులు మంజూరుకు కృషి చేసిన వ్యక్తి అని అన్నారు. శ్రీకాకుళంలోనూ, ఆముదాలవలస లోనూ పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి జిల్లాను పారిశ్రామిక అభివృద్ధి దిశగా నడిపించారని తెలిపారు. వ్యవసాయ పరిశోధన కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేసి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేశారని ఆయన అన్నారు. వంశధార సాగునీటి ప్రాజెక్టు ద్వారా జిల్లాలో వ్యవసాయ రంగానికి కృషి చేసిన స్వర్గీయ రాజగోపాల్ రావు కృషికి, జిల్లాలో వంశధార నదిపై నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాల్ రావు వంశధార ప్రాజెక్టుగా నామ కరణం చేయటం జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేశారని వివరించారు. ఆయన రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకొని ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని రమేష్ స్పష్టం చేశారు. వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ మున్సి పల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, జగ నన్న సేవ కేంద్రం ఏర్పాటు చేసిన డాక్టర్ చింతాడ రవికుమార్, సువ్వారి నేతాజీ, సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, గోవిందరావు, దుంపల శ్యామలరావు లు కళింగ రాజుగా రాజగోపాల రావును కీర్తిస్తూ అభినందించారు. వేలాది మందికి జీవితాలు ప్రసాదించిన మహా మనిషి, మరణం కన్నా స్మరణ గొప్పదని చెప్పే మహనీయుడు అన్నారు. అక్కులపేట, ఎస్ ఆర్ సి పేట తదితర గ్రామ ప్రజలు అభిమానులు పాల్గొని రాజగోపాల్ రావుకు నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : జాతీయ రహదారిపై మండలంలోని సనవలవానిపేట గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. అతడు ఝార?ండ్ రాష్ట్రం నివాసి ప్రకాష్ కుజూర్ (48) గా పోలీసులు గుర్తించారు. మానసిక స్థితి సరిగా లేని ప్రకాష్ ఉద్యోగం కోసమని ఈ ప్రాంతానికి వచ్చి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు ఎచ్చెర్ల ఎస్సై వి సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ వివాదంలో 16 మందిపై కేసు నమోదు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : దుప్పలవలస పరిధిలోని ఓ భూ వివాదంపై ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 16 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి సత్యనారాయణ తెలిపారు. ఈ భూమి హక్కులపై ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దిగారన్నారు. ఈ సంఘటనపై డి వెంకట సాయి రామ్, పి వెంకటరమణలు వేరవెరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులపై మంత్రి ధర్మానతో ఎమ్మెల్యే చర్చ

విశాలాంధ్ర-పాతపట్నం : రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావుని శ్రీకాకుళం లోని అతని నివాస గృహం నందు, పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యురాలు రెడ్డి శాంతి గౌరవ ప్రదంగా కలిసి పాతపట్నం నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను గూర్చి సమీక్షించారు. అలాగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నత్తు రామారావు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలను విద్యాశాఖ బృందం తనిఖీ

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం మెట్టూరు గ్రామ ఆదర్శ పాఠశాలను బుధవారం మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బృందం తనిఖీలు జరిపారు. విద్యా స్థాయిపై విద్యార్థులను వివిధ ప్రశ్నలు సంధించారు.విద్యా బోధనపై ఉపాధ్యాయులు అభిప్రాయాలను తెలుకున్నారు. వివిధ రికార్డులను పరిశీలించారు. మొత్తంపై మెట్టూరు ఆదర్శ పాఠశాల పనితీరుపై తనిఖీ బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బృందంలో ఏంఇఓ శ్రీనివాసరావుతో పాటు బృందం పాల్గొన్నారు.

జలుమూరులో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర-జలుమూరు: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం వెనుక ఉన్న నీలగిరి తోటలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. బానోజీరావు, రాజశేఖర్, వెంకటేశ్వరరావు, లక్ష్మీబాయిలకు చెందిన 6 ఎకరాల నీలగిరి చెట్లు కాలిపోయాయి. వీటికి పక్కనే ఉన్న జీడి, మామిడి తోటల్లోనూ అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది.

ఘనంగా మంత్రి డా.సీదిరి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పలాస : పలాస ఎమ్మెల్యే, రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలు బుధవారం ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, ఆత్మీయుల ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి తన నివాస గృహం వద్ద భారీ కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. మంత్రి డాక్టర్ సీదిరి జన్మదిన వేడుకలు సందర్భంగా ప్రగతి భవన్ ఆవరణలో బుధవారం అభిమానులు, అధికారులు, కార్యకర్తలు సమక్షంలో కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాజకీయాల కతీతంగా ప్రజలు, పార్టీ నేతలు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు తీరారు. కాగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ఎస్‌పివి గ్రూప్స్ అధినేత శ్రీనివాసరెడ్డి, పారిశ్రామిక వాడ నాయకులు మల్లా రామేశ్వరం, తూముల శ్రీను, తహశీల్దార్ ఎల్ మధుసూధన్, మున్సిపల్ కమీషనర్ రాజగోపాల్‌లు జన్మదిన శుభాకాంక్షలు తెలిసిన వారిలో ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ సీదిరికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిపీ నాయకులు హనుమంతు వెంకటరావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీ, ఎఎంసి పివి సతీష్, శిష్టు గోపి, మామిడి నర్సింహమూర్తి, బెల్లాల శ్రీను, కె సత్యం, మందస ఎంపిపి డొక్కరి దానయ్య, పలాస మున్సిపల్ వైస్‌చైర్మన్లు మీసాల సురేష్, బొర క్రిష్ణారావు, పిఎసిఎస్ చైర్మన్ పైల చిట్టి, పలాస ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, చింతాడ మాధవరావు, పోతనపల్లి హరి, ఉదయ్‌కుమార్, దువ్వాడ మధుకేశ్వర్, పాలిన శ్రీనివాస్, పులిరాజులు ఉన్నారు. అలాగే ఎపియుడబ్ల్యుజె జిల్లా కార్యదర్శి డి.మహారణ, పలాస కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు జగదీష్, రాము, నారాయణ, అశోక్, దుర్యోధన మహారణ, తిరుమల, పాత్రో, భాస్కర రావు, నాని తదితరులున్నారు. అలాగే 10వ వార్డులో కౌన్సిలర్ సర్వాన గీతరవి ఆధ్వర్యంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పుట్టిన రోజు వేడుకలు వార్డు ప్రజలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు.

రక్తదానం : రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన సందర్భంగా మంత్రి నివాసం వద్ద పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం తో సమానంగా భావించి ఈ రక్తదానం శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు.

గృహ సారథులు, కన్వీనర్లు అంకితభావంతో పనిచేయాలి : ఎమ్మెల్సీ దువ్వాడ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధిచేకూర్చడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆయన బుధవారం మండలంలోగల చీపుర్లపాడు సచివాలయం పరిధిలోగల చీపుర్లపాడు, కన్నేవలస పంచాయతీ పరిధిలోగల సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు గృహసారదులతో ఊడికలపాడు గ్రామంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎలాంటి వివక్ష లేకుండా పార్టీలు కులం, మతం చూడకుండా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి సీం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. అన్నీ పార్టీల వారికి పథకాల ద్వారా లబ్ధిచేకూరుతుందని వివరించారు. టీడీపీ ఎన్ని కుట్రలు చేసిన 2024 ఎన్నికల్లో వైసీపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు ప్రజలు మరోసారి ఆశీర్వదించాల న్నారు. గృహసారథులు ఇంటింటికి వెళ్ళి ప్రస్తుత గత ప్రభుత్వ పాలనలో లేడాలను వివరించాలన్నారు. వచ్చే ఎన్నికలలో అధికారం కోసం టీడీపీ ఎన్నో ఎత్తుగడులు వేసి, ప్రజలకు అసత్యలు చెప్పి ప్రజలలో ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై నమ్మకాన్ని వమ్ముచేయటానికి ఇప్పటినుంచే ఎన్నో ఎత్తుగడలు వేస్తుందని దీనికి సచివాలయ కన్వినర్లు, గృహసారదులు తిప్పికొట్టే విధంగా, టీడిపి నాయకులు చెప్పిన మాటాలు అని అసత్యలని మీరు ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. అందరం కలిసి పార్టీ విజయం కోసం ఇప్పటి నుంచి కష్టపడి పనిచేయాలని ఆయన కార్యకర్తలను, అభిమానులను సూచించారు. అలాగే గ్రామంలో పర్యటించి వృద్ధులతో, యువతతో జగన్‌మోహన్‌రెడ్డి పారిపాలన గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, సచివాలయ కన్వినర్ల ఇన్‌చార్జీ గడ్డవలస నాగభూషణరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, మండల విఫ్ బొద్దు అప్పన్న, స్థానిక సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగులపై టార్గెట్ వేధింపులు అన్యాయం

విశాలాంధ్ర-పొందూరు : పోస్టల్ ఉద్యోగులపై పనిబత్తిడి పెంచుతూ, ఆచరణకు సాధ్యం కానీ బాధ్యతలు అప్పగిస్తూ, పిఓఎస్‌బి మహామేళ నిర్వహణలో భాగంగా 50 ఖాతాలు చేయాలని అధికార వేధింపులకు నిరసనగా ఎన్‌ఎఫ్‌పిడి-జిడిఎస్ ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక పోస్ట్ ఆఫీస్ వద్ద బుధవారం భోజన విరామ సమయంలో ఆందోళన చేపట్టారు. టార్గెట్ల పేరుతో అధికారుల వేధింపులు ఆ పని పక్షంలో ఉద్యమ సైరన్ పోరుకు సిద్ధమవుతామని నినాదాలు చేశారు. అధిక పని భారం- తగ్గించాలి తగ్గించాలి, ఆచరణకు సాధ్యం కానీ అశాస్త్రీయమైన టార్గెట్లు-ఆపాలి ఆపాలి, పోస్టల్ ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి, వర్ధిల్లాలని హెూరెత్తిన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ ఎఫ్ పి ఈ -జిడిఎస్ ఉద్యోగులసంఘ జిల్లా సహాయ కార్యదర్శి బెవర అప్పారావు మాట్లాడుతూ సమస్యల సాధన కోసం గతంలో రాష్ట్ర సంఘ నేతలు సర్కిల్ పోస్టు మాస్టర్ జనరల్ తో పాటు దేశవ్యాప్తంగా అన్ని డివిజన్ల సూపరెంటెంట్ రాష్ట్ర అధికారులకు వినతి పత్రం అందించామన్నారు. తాక లేని కార్మిక వేధింపుల పట్ల ఇక ఉపేక్షించేది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తు ఉద్యమం ఉదృతం చేస్తూ ఉద్యమ పోరాటాల పురిటిగడ్డ విజయవాడ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం ముందు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తపాలా ఉద్యోగుల మార్చి 9న మహా ధర్నాకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తపాల ఉద్యోగులు బి.సురేష్, ఎం.శ్రీనివాసరావు, దేవిక, పొగిరి అప్పారావు, పి.ఉమా, జి.శేఖర్ పాల్గొన్నారు.

బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వహిస్తే కఠిన చర్యలు : డ్వామా పిడి

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఉపాధి హామీ పథకం సిబ్బంది బాధ్యత రాహిత్యంగా విధులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జివి చిట్టి రాజు స్పష్టం చేశారు. బుధవారం డ్వామా కార్యాలయంలో పనుల ప్రగతిలో వెనుకబడిన మండలాల సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పిడి మాట్లాడుతూ, లక్ష్యం మేరకు ఉపాధి కల్పనలో కొన్ని మండలాలు వెనుకబడి ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కుంటి సాకులు చెబితే సహించేది లేదని క్షేత్రస్థాయిలో జరుగుతున్న సమాచారం పూర్తిస్థాయిలో తన వద్ద ఉందన్నారు. ఆసక్తి లేనివారు ఉద్యోగం వదిలి వెళ్లిపోవాలని హెచ్చరించారు. సగటు వేతనం రూ. 250 వచ్చేలా పనులు చేయాలని వదేపదే చెప్పినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రగతి ఎందుకు లేదని ప్రశ్నించారు. వచ్చేవారం నుండి పని ప్రదేశాలలో కూలీల సంఖ్యను పెంచాలని, అదేవిధంగా సగటు వేతనం 250 తగ్గకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. కూలీలు పనులకు వచ్చేవిధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. జాబ్ కార్డులో నమోదైన వారందరూ పనులకు రావాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్మిక శక్తి జిల్లాలో ఎక్కువగా ఉందని వారికి ఉపాధి హామీ పనులు పట్ల అవగాహన కల్పించాలన్నారు. వంద రోజులు పని దినాలపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. విధి నిర్వహణలో ఉదాసీనత పనికిరాదని, అందరూ సమిష్టి కృషితో పనిచేసినప్పుడే జిల్లా అగ్రస్థానంలోకి వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏపీడీలు పి రాధ, శైలజ, కె లోకేష్, హరిత, మురళీకృష్ణ, పరిపాలనాధికారి ప్రసాదరావు, ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలోని కెజిబివి పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా మాతృభాషా దినోత్సవం శుభాకాంక్షలు ప్రిన్సిపాల్ శారద తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి లో ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషా దినోత్సవంను 1999 నవంబర్ 17 యూనెస్కో ప్రకటించింది. 2000 ఫిబ్రవరి నుంచి ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స మన పూర్వీకులు చెప్పినట్లు అమ్మపాల రుచులు అక్షరాలుగా మారి అందమైన రూపం దిద్దుకుంటే ఆ రూపమే అమ్మ భాష, అదే మాతృభాష అని ప్రిన్సిపాల్ శారద కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-సోంపేట : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.చాణక్య, జిల్లా ఉపాధ్యక్షులు జి.భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు హామీని అమలు పర్చాలని, ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని, పెండింగ్ డిఏను విడుదల చేయాలని, పని సర్దుబాటు లోపాలను సవరించాలని, పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు చెల్లించాలని, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని పలు డిమాండ్ల సాధనకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశల వారీ పోరాట కార్యక్రమంలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం తహశీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మందస, సోంపేట, కంచిలి మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.ఢిల్లీ, డి.చంద్రశేఖర్, డి.గోవిందరావు, జి.తిరుపతిరావు, ఆర్.కామరాజు, కె.షన్ముఖరావు, కార్యకర్తలు కె.పాపారావు, ఎ.ఢిల్లీరావు, బి.చక్రధర్, ఎన్.కరుణాకర్, గిరిధర్, ముకుందరావు, హరీష్, సంతోష్ పండా తదితరులు పాల్గొన్నారు.

బోధనలో నైపుణ్యాలను మెరుగుపర్చాలి

వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : విద్యార్థులకు చదువుపట్ల ఆసక్తి కలిగేలా అధ్యాపకులు తమ బోధనలో నైపుణ్యాలను మెరుగుపర్చాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీఆ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో అధ్యాపకుల కోసం నిర్వహించనున్న ఫేకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాంను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా బోధనలో మెళుకవలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా అత్యుత్తమ పద్ధతుల్లో బోధన చేయాలన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్.సూర్యప్రకాష్ భారత రాజ్యాంగం మిశ్రమ సంస్కృతి అనే అంశంపై మాట్లాడారు. భారత రాజ్యాంగం 22 భాగాలలో ఒక్కో భాగం భారతీయ సంస్కృతి, నాగరికతలను అద్దం పట్టేలా వివరించారన్నారు. రాజ్యాంగం సూచించినట్లు భారతీయులు నడుచుకోవాలన్నారు. భారతీయ సనాతన ధర్మం, సంస్కృతి, నాగరికతలు విభిన్నమైన విలువలతో కూడినవన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్ ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే 'చంద్రభూషణ్' హత్య

పోలీసుల ఎదుట ఒప్పుకున్న భార్య, బావమరిది

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలోని పెద్ద కరగాం గ్రామంలో మంగళవారం జరిగిన ఇర్రి చంద్రభూషణ్ హత్య పథకం ప్రకారమే జరిగిందని పోలీసులు ధ్రువీకరించారు. మద్యం మత్తులో తరచూ భార్య, భాగ్యలక్ష్మి తో ఘర్షణలు పడిన చంద్రభూషణకు, ఎచ్చెర్ల మండలం, తోట పాలెం గ్రామానికి చెందిన ఆయన బావమరిది, బత్తి శివ నారాయణ పెద్ద కరగాం వచ్చి, కొట్టడం ఆనవాయితీ అయిపోయింది. దీనిలో భాగంగా మహాశివరాత్రి రోజు సాయంత్రం చంద్రభూషణ్, భాగ్యలక్ష్మి మధ్యన మరలా ఘర్షణ జరగడంతో ఆ రోజే, తన అన్నయ్య అయిన శివ నారాయణకు, భాగ్యలక్ష్మి ఫోన్ చేసి తెలియజేసింది. విషయం తెలుసుకున్న శివ నారాయణ సోమవారం నాడు పెద్ద కరగాం వచ్చి, చంద్రభూషన్ను పట్టు కొందామని ప్రయత్నించి విఫలమయ్యాడు. మరుసటి రోజు మంగళవారం మళ్లీ గ్రామానికి వచ్చిన శివ నారాయణ మద్యం మత్తులో ఉన్న చంద్రభూషన్ను, తన చెల్లెలు భాగ్యలక్ష్మి సహకారంతో పెద్ద కరగాంలో వాడి ఇంటిలో పెట్టి, కర్రలతో వీపు నుండి పాదాల వరకు చావగొట్టి, నడవ లేకుండా చేశారు. అప్పటికే దెబ్బలకు తాళలేక చంద్రభూషన్ మృత్యు వాతపడ్డాడు. ఈ విషయం గ్రామస్తులకు తెలిసిపోయి, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చంద్రభూషణ్ మృతికి కారణమైన భాగ్యలక్ష్మి, శివ నారాయణను పోలీసులు విచారణ చేయగా, మేమే కర్రలతో చిత్ర హింసలు పెట్టి, చంపామని ఒప్పుకున్నారు. బుధవారం చంద్రభూషణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం చేసిన అనంతరం పెద్ద కరగాం గ్రామంలో మృతుడు బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏల విడుదల, 12వ పీఆర్సీ నియమించుట తదితర ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరం కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరుగు ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్. కరుణాకర్, అధ్యక్షుడు చల్ల కేశవరావు, ప్రధాన కార్యదర్శి హెచ్. శివప్రసాద్‌లు అన్నారు. వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీతోపాటు, అక్రమ డెప్యూటేషన్‌ల రద్దు చేయాలని, అలాగే 11వ వేతన సవరణలోని అసంఘతాలు తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని, ప్రతీ నెల 1వ తేదీకి జీతాలు ఇవ్వాలని, 3,4,5 తరగతుల విలీనం రద్దు చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. కావున మండలంలోగల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ధర్నాను విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు.

కళాశాల ప్రాంగణ ఎంపికల్లో 'వందన' ఎంపిక

విశాలాంధ్ర-సోంపేట : కళాశాల ప్రాంగణ ఎంపికలో సంస్కారభారతి డిగ్రీ కళాశాల విద్యార్థిని బుడ్డెపు వందన విప్రోకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ కంచిలి మండలం ఎంఎస్‌పల్లి గ్రామానికి చెందిన వందన ఓ సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబం నుంచి వచ్చినప్పటికీ విద్యాభ్యాసం లో చురుగ్గా ఉంటూ సామాన్యులు కలలు గనే ఐటి కొలువు సాధించడంపట్ల చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. విప్రో సంస్థకు ఎంపికైన వందనను కళాశాల యాజమాన్యం, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ నిమ్మన దాసు, చైర్మన్ వై.దేవరాజు, డైరెక్టర్ శ్రీనుబాబు, ఎట పాపారావు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కవిబాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

మంత్రి అప్పలరాజుకు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర సంతబొమ్మాళి : రాష్ట్ర పాడి పరిశ్రమ, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు సంతబొమ్మాలి మండలం వైకాపా నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సంతబొమ్మాలి మండలం వైకాపా పార్టీ మాజీ అధ్యక్షుడు సుగ్గు రామిరెడ్డి, వైకాపా నాయకులు సుగ్గు చెన్నారెడ్డి, తిప్పన రమణారెడ్డి తో పాటు పలువురు వైకాపా నాయకులు మంత్రిని కలిసి పూలమాలలు, దుస్సాలులతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆహార నాణ్యత తనిఖీ

విశాలాంధ్ర-జలుమూరు : మండలం బసివాడ పంచాయతీ పరిధి ఈదులవలసలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎంపీపీ వాన గోవి పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా భోజనం నాణ్యతలో రాజీ వద్దని సూచించారు. భోజన తయారీలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. పౌష్టికాహారంతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

ఉచిత నేత్ర చికిత్సలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : హెల్పేజ్ ఇండియా సోంపేట ఆరోగ్యవరం కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర చికిత్సలు నిర్వహించారు. పట్టణంలో గొల్లవీధికి చెందిన కాళ్ళ బాబూరావు చొరవతొ చేపట్టిన శిబిరంలో పది మందికి ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్సలు జరిపించారు. 15మందికి కళ్ళద్దాలు అందివ్వడంతో పాటు ఉచితంగా ఔషదాలు అందించారు.

ఇంటర్ విద్యార్థులకు మరో అవకాశం

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఇంటర్ విద్యాభ్యాసం మధ్యలో మాని వేసిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సార్వత్రిక విద్యా విధానం ద్వారా ఇంటర్‌లో చేరేందుకు ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్ విద్యా మండలి వారు ప్రత్యేక అవకాశాలను కల్పించిందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆమదాలవలస ప్రిన్సిపాల్ బొమ్మలాట శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంట ర్మీడియట్ లో చేరదలిచినవారు ఈనెల 27వ తేదీలోగా ప్రిన్సిపాల్ ను కలిసి అడ్మిషన్లు పొందవచ్చునని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో కోరారు.

శర్వాణీ విద్యాలయంలో 'ఏన్యువల్ స్పోర్ట్స్ మీట్'

విశాలాంధ్ర-అరసవల్లి : స్థానిక అరసవల్లి లోడ్‌లోనున్న 'శర్వాణీ విద్యాలయ'లో "ఏన్యువల్ స్పోర్ట్స్ మీట్" వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో కె.వెంకట్ ఉజ్వల్, జిల్లా యూత్ అధికారి, నెహ్రూ యువకేంద్ర సంఘటన్ పతాకావిష్కరణ గావించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత సూరిబాబు మాట్లాడుతూ శర్వాణిలో ప్రతి విద్యార్థి సర్వతోముఖ వికాసం కోసం అనేక ఏక్టివిటీస్ ను నిర్వహించడం జరుగుతుందని, స్పోర్ట్స్ మీట్ వలన విద్యార్థులకు క్రీడాస్ఫూర్తి, మానసికవికాసం, పోటీతత్వం వంటి లక్షణములతోపాటు శరీర పటుత్వానికి దోహదపడతాయని, గత మూడు రోజులుగా విద్యార్థులు పలుక్రీడల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలియజేశారు. ఈసందర్భంగా వివిధ క్రీడల పోటీలలో గెలుపొందిన విజేతలకు అభినందనలు తెలిపారు. ముఖ్యఅతిథిగా కె.వెంకట్ ఉజ్వల్, జిల్లా యూత్ అధికారి, నెహ్రూ యువకేంద్ర సంఘటన్ మాట్లాడుతూ క్రీడలలో ప్రావీణ్యంగల విద్యార్థులకు సంపూర్ణ వికాసంతో పాటు భవిష్యత్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ అవకాశాలకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.కె.రేఖ మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్లో అన్ని ఆటలలో విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, మీట్ విజవంతం కావడానికి శర్వాణి వ్యాయామ ఉపాధ్యాయుడు పి.మనోహర్, ఇతర స్పోర్ట్స్ ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చివరిగా స్పోర్ట్స్ మీట్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ ఎ. అంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మన బడి' అమ్మఒడి లాంటిది

- కష్టపడి కాకుండా ఇష్టపడి చదవండి

- వీడ్కోలు సభలో శాంతినికేతన్ విద్యా సంస్థల డైరెక్టర్ ప్రతాప్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : స్థానిక గూనపాలెంలో ఉన్న శాంతినికేతన్ పాఠశాలలో మంగళవారం ఫేర్‌వెల్ పార్టీ వేడుకలు, డైరెక్టర్ కొర్ను ప్రతాప్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వేడుకలను కొర్ను పావనితో ప్రారంభించి ప్రతాప్ మాట్లాడుతూ "మన బడి" అమ్మ ఒడి లాంటిదని, అందరూ బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తేవాలని, కష్టపడి కాకుండా ఇష్ట పడి చదవాలన్నారు. అనంతరం పావని మాట్లాడుతూ పిల్లలు చదువుతోపాటు, ఆట, పాటల్లోనూ చలాకీగా ఉండేలా చూసుకోవటం మన బాధ్యతని, అందుకు కష్టపడుతున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ ఒక్క విద్యార్థి బాగా చదువుకొని, క్రమశిక్షణతో పాఠశాలకు, జిల్లాకు, తల్లి తండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ వేడుకలలో ఒకటవ తరగతి పిల్లలు మోక్షిత తో చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకలలో భాగంగా నిర్వహించిన పలు పోటీలలో పాల్గొని, గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మెమొంటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూరంగి మోహన రావు, ఎస్. అప్పలరాజు, ఎన్.ఆనంద్ రావు, గొర్ల విజయ్‌కుమార్, విద్యార్థులు, తల్లితండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు మాజీ కేంద్ర మంత్రి ఎర్రంనాయుడు జయంతి

విశాలాంధ్ర సంతబొమ్మాళి : మాజీ కేంద్రమంత్రి, దివంగత నేత కింజరాపు ఎర్రం నాయుడు జయంతి ఉత్సవాలు నిమ్మాడలో ఈనెల 23న నిర్వహించడం జరుగుతుందని సంతబొమ్మాలి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న తెలిపారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, సర్పంచులు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు వివిధ హెూదాల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు హాజరై, ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని వారు కోరారు.

న్యూక్లియస్ విత్తనాభివృద్ధి తోటల పెంపకానికి స్థల సమీకరణ

విశాలాంధ్ర-బూర్జ : మండలంలోని పెద్దపేట వైఎస్ఆర్ హెచ్‌యు ఉద్యాన పరిశోధనా స్థానం పరిధిలోని పరిశోధనా సంచాలకులు ఎల్ నారంనాయుడు ఆధ్వర్యంలో పరిశోధన స్థానంలో కొబ్బరి న్యూక్లియస్ విత్తన అభివృద్ధి తోటల పెంపకం కొరకు బుధవారం స్థల సమీకరణకు సందర్శించారు. నారం నాయుడు మాట్లాడుతూ ఈ పర్యటనలో స్థల పరిశీలన మరియు స్థలం ఎంపిక పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు వారి ఆర్థిక సహాయ సహకారాలతో త్వరలో కొబ్బరి న్యూక్లియస్ విత్తన అభివృద్ధి కింద కొబ్బరి రకాలను సేకరించి ఉద్యాన పరిశోధనా స్థానంలో నీటి, తోటల పెంపకం చేపట్టడానికి సన్నాహాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ యస్ కుమారవెల్, డా. వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధనా స్థానం - పెద్దపేట ప్రధాన శాస్త్రవేత్త డా. బీవీకె భగవాన్, ఆర్‌వీ వరప్రసాద్, హెచ్‌వోటి అయంతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలో పొందూరు ఉన్నతపాఠశాల విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-పొందూరు : జాతీయస్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలో మండల కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్ నాగవర్ధన్ షాట్పుట్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం పొందాడు. ఈ నెల 15 నుంచి 13 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఇండోర్లో జరిగిన 25 జాతీయస్థాయి విభిన్న పోటీలలో బదిరుల విభాగం నుంచి షాట్పుట్ క్రీడలో పాల్గొన్న నాగవర్ధన్ ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకం, ప్రశంశా పత్రం వత్రం సాధించడమే కాకుండా 100 మీటర్ల పరుగు పందెం పోటీలో జాతీయస్థాయి. లో 4 వ స్థానంలో నిలిచాడు. జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన నాగవర్ధన్ ను హెచ్‌ఎం పివి రామరాజు, పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు డి. ఉదయ కుమార్, గణపతి తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని తొత్తిడిపుట్టుగ గ్రామంలో ఇటీవల 5 ఇల్లు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. ఈ ఘటనతో ఐదు కుటుంబాలు వారు నిరాశ్రయులు అయ్యారు. విషయాన్ని తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు స్పందించి ఆ ఐదు కుటుంబాల వారికి ఒక్కొక్క కుటుంబానికి నెల రోజులకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేశారు.అలాగే కంచిలి మండలం మండపల్లి గ్రామ శివారులో గల సీతయ్య ఫౌండేషన్ వారు బాధితులకు వస్త్ర దానం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పూడి రామారావు,పూడి సీతయ్య,ఫౌండేషన్ వ్యవస్థాపకులు రమేష్,హెల్పింగ్ హాండ్స్ సభ్యులు సాహు కాళీ,వెంకటేష్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల ప్రాజెక్టు ఎంపిక

విశాలాంధ్ర-పొందూరు : శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలలో పొందూరు మండలంలోని వావిలపల్లిపేట వద్ద గల ఆదర్శపాఠశాలకు చెందిన గోల్డెన్ రేషియో మాథ్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైంది. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు వెంకటేష్, పవన్ కుమార్లు తయారుచేసిన ఈ ప్రాజెక్టు ఆకట్టుకుంది. ఈనెల 27,28వ తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలలో దీనిని ప్రదర్శించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ హెచ్. ప్రభాకరరావు, గణితం ఉపాధ్యాయులు బి.వి. సత్యనారాయణ, డి. భవానీ, బి. విశాలాక్షిలు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.